# బ్రతుకు వేగం

## -పరిణం రామమోహనరావు

స్కూలు టీచరుగా నేను రిటైరై ఆరేళ్లు కావస్తోంది.

కొవ్వూరు దగ్గరలో వున్న ఆ కుగ్రామంలో నాకంటూ ఓ చిన్న డాబా ఇల్లు వుండడంతో సర్కారు వారిచ్చే పెన్షన్ అలా సరిపోతోంది.

ఇద్దరు కొడుకులు. పెద్దవాడు ఢిల్లీలో మిలట్రీలో పని చేస్తూ, చిన్నవాడు విశాఖపట్నం కెనరా బ్యాంకులో వారి జీవనం వారు గడిపేస్తున్నారు.

వారికి పెళ్లిళ్లు చేయడమనే నా కర్తవ్యం కూడా పూర్తి చేశాను.

బాధ్యతలు వదలని బందీనికాను. కానీ ఏకాకిని.

నాతోపాటు కష్టాల్లో, సుఖాల్లో పాలుపంచుకుని అన్నివిధాలా నాకు ధైర్యం చెప్పి నన్ను నడిపించిన నా భార్యలేదు.

దాదాపు ముప్పై ఎనిమిది వసంతాలు ఆమే నాకు అన్నీ. స్కూల్లో నేను పిల్లలకి టీచరైతే ఇంట్లో ఆమే నాకు టీచర్. క్రితం సంవత్సరం ఓ రాత్రి గుండెనొప్పి వచ్చి పోయింది. రాత్రి ఇద్దరం కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశాము. పడుకున్నది తను. ప్రొద్దున్న మరి లేవలేదు. నిద్రపోతున్నట్లుగానే వుంది. పండు ముత్తయిదువుగా చాలా సుఖవంతమయిన చావును చేజిక్కించుకుంది.

★★★

పదిరోజులు అయింది నా భార్య సంవత్సరీకాలు పూర్తయి.

చాలా ఒంటరిగా, ముఖ్యంగా ఒంటరితనంలోని భయాన్ని అనుభవిస్తున్న నాకు ఇంట్లోపరిసరాలు, ఆ వంటగదీ ఇవన్నీ చూస్తుంటే మా అన్యోన్య దాంపత్యంలో కలబోసుకున్న అనుభూతులు, ఆప్యాయతలు పదేపదే గుర్తువచ్చి మరింత వేధించసాగాయి.

కొన్నాళ్లు ఎక్కడికయినా వెళ్లి అలా తిరిగి రావాలనిపించింది.

ఇంటి గురించి నేను చూసుకుంటాను, మీరెళ్లి రండని రామారావు మాస్టారు ధైర్యం చెప్పడంతో ఆ కోరిక మరింత బలపడింది.

ఎక్కడికని వెళ్లడం?

పెద్దవాడుండే ఢిల్లీకి ఈ వయసులో నేను ప్రయాణం చేయలేను.

చిన్నవాడు రఘు వుండే విశాఖపట్నం అయితే నయమనుకుని వాడికి టెలిగ్రాం ఇచ్చాను. ఫలానా రోజు రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరుతున్నానని.

ప్రయాణం రోజు రానే వచ్చింది. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ విశాఖ చేరేసరికి మధ్యాహ్నం ఒంటిగంట అయింది. వేసవికాలం మిట్టమధ్యాహ్నం తన ప్రభావమేమిటో చూపిస్తోంది.

కిటికీలోంచి చూస్తూ వాడికి చేయి ఊపాను.

''రండి నాన్నా. గంట లేటుగా వచ్చింది'' అన్నాడు నా సూట్‌కేస్, బాగ్ అందుకుంటూ.

''ఏరా! ఆఫీసుకి సెలవు పెట్టావా?''

''ఆ! గంట పర్మిషన్ తీసుకుని వచ్చాను. మిమ్మల్ని ఇంటివద్ద దింపి మళ్లీ వెళ్లాలి'' అన్నాడు.

స్టేషన్ బయట విపరీతమైన జనం. ఆటోస్టాండులో ఆటోలకోసం, సిటీబస్ స్టాప్‌లో వాటికోసం జనం పరుగులు పెడుతున్నారు. లేటయితే అవి కూడా దొరకవేమోనని ఆత్రంగా.

త్వరలో విశాఖ మరో బొంబాయి అయిపోతుందనిపించింది ఆ వేగం చూస్తుంటే.

ఇంటికి చేరేసరికి మధ్యాహ్నం రెండయింది.

''మీరు స్నానం చేసి రండి నాన్నా. భోజనం చేద్దురుగానీ'' అంటూ బాత్రూం చూపించాడు.

స్నానం చేసాకగానీ మళ్లీ మామూలు స్థితికి రాలేకపోయాను. ముఖ్యంగా గత పదేళ్లుగా అసలు ప్రయాణాలు ఎరుగని నేను ఈ కాస్త అయిదుగంటల అలసటకే తట్టుకోలేకపోయాను.

వయస్సు తెచ్చిన మార్పేమో!

భోజనం చేసి కాసేపు నడుం వాల్చాను. వాడు ఆఫీసుకు వెళ్లాడు. కోడలు కూడా ఉద్యోగం చేస్తుండడంతో తనూ ఇంట్లో లేదు.

★★★

సాయంత్రం ఆరవుతుండగా ఇద్దరూ వచ్చారు. రాగానే ''బాగున్నారా మామయ్యా'' అంటూ ఆప్యాయంగా పలకరించింది కోడలు.

''ఏడేడి రవి? ఇంకా వాడి చదువు పూర్తవలేదా?'' అంటూ నా మనవడిని చూడాలన్న కుతూహలంతో అడిగాను.

''వాడు స్కూలు నుంచి అలాగే ట్యూషన్‌కి వెళ్లి ఏడుగంటలకు వస్తాడు మామయ్యా''

''ఏం చదువులో ఏమిటో నాకేం అర్థం కావడంలేదు.'' అంటూ తనకి వంత పాడుతూ నా పుత్రరత్నం.

దాదాపు ఏడుగంటలవుతుంటే నా మనవడు వచ్చాడు దాదాపు అరబస్తాలాంటి బేగ్ వీపున వేలాడదీసుకుని.

''తాతయ్యా! తాతయ్యా'' అంటూ నన్నొదల్లేక పోయాడు వాడు.

వాడికోసం నేతెచ్చిన తాండ్ర, తేగలు ఇచ్చాను.

తాండ్ర మాత్రం తింటూ తేగల్ని చూపిస్తూ ''ఇది ఎలా తింటారు మమ్మీ'' అంటూ వాళ్లమ్మని అడిగాడు.

''నేను చెప్తా రారా'' అంటూ ఓ తేగని తీసి డిమాన్‌స్ట్రేషన్ చేసి చూపించాను.

రాత్రి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు చేశాము.

మా పల్లెల్లో విశేషాలు, చిన్నప్పుడు మేం కాలువగట్ల మీద ఆడుకునే ఆటలు, కార్తీకమాసంలో ఉసిరిచెట్టు క్రింద భోజనాలు, పక్కచేనులోంచి దొంగతనంగా తీసుకువచ్చి కాల్చుకుని తినే జీడిపిక్కల సంరంభం ఇవన్నీ చెబుతుంటే నోరెళ్లబెట్టి విన్నాడువాడు.

భోజనంలో ఆమ్లెట్‌కి చేయి తగిలించకుండా కేవలం స్పూను, ఫోర్కులతో కట్ చేస్తూ తినేవాడిని ఆశ్చర్యంగా చూడడం నావంతు అయింది.

అలాంటి వాడికి తేగలు తినమని ఇస్తే ఎలా? కాలంతోపాటు ఆహారపు అలవాట్లు కూడా కొద్దికొద్దిగా మారిపోతాయేమో?

మా తరంవేరు, ఈ తరంవేరు అంతే!

ఇది నాకు నేను చెప్పుకున్న సమాధానం.

★★★

మర్నాడు ఉదయం షరా మామూలే!

వాళ్లిద్దరూ, వాడూ వాళ్ల వాళ్ల ఉద్యోగాలకి, స్కూలుకి వెళ్లిపోయారు. మళ్లీ ఇంట్లో ఒంటరిగా. కాసేపు పేపర్ తిరగేయడం, ఇంకొంతసేపు వాడి పెళ్లి ఆల్బమ్‌లు చూడడం, టీవీ చూడడంతో మధ్యాహ్నం అయింది.

భోజనం వండి టేబుల్‌పై అన్నీ సర్ది వెళ్లిపోడంతో అది పెట్టుకుని తిని కాసేపు నడుం వాల్చాను.


సాయంత్రం అయిదున్నర అవుతుండగా కొడుకూ, కోడలూ మనవడిని స్కూలు నుంచి తీసుకువచ్చారు.

''నాన్నగారు సినిమాకి వెళ్దాం తయారవండి'' అన్నాడు.

నాకు అంతగా ఇష్టం లేకపోయినా వాడి సరదా ఎందుకు కాదనాలి అని సరే అన్నాను.

అందరం కలిసి వెళ్లాము. ఏటా మా ఊళ్లో జరిపే అమ్మవారి జాతరలా వుంది సినిమా థియేటర్ వద్ద జనాన్ని చూస్తుంటే.

టిక్కెట్లు ఎలాగో కష్టపడి సంపాదించాడు. టిక్కెట్లు ఇరవై రూపాయలంట. అసలు ప్రతిదానికీ నాకు నా



రోజులతో పోల్చి చూడడం అలవా టైపోయింది. అలా పోల్చి చూసినప్పుడల్లా 'అయ్య బాబోయ్' అంటూ నిట్టూర్పు విడవడం కూడా పరిపాటి.

సినిమా అయ్యాక ఆటోలో బయలుదేరాము.

''ఇంటికెళ్లి ఇప్పుడేమి వండుతాం. ఏదైనా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌వద్ద ఆటో ఆపించండి. పార్శిల్స్ చేయించి ఇంటికి పట్టుకుని వెళదాం'' అంటూ నా కోడలు దారిలో ఆర్డర్ జారీ చేసింది.

ఏదో షాపు ముందు ఆగింది ఆటో. నా కొడుకు వెళ్లి ఏవో పార్శిల్ చేయించి తీసుకొచ్చాడు.

''ఒరేయ్ రవీ! ఫాస్ట్‌ఫుడ్స్ అంటే ఏమిట్రా'' అన్నాను నేను. అసలు నాకు ఏమీ తెలియని దాని గురించి.

''అబ్బా! నీకు ఏమీ తెలియదు తాతయ్యా. రకరకాల తినేవి అన్నీ మనం చెప్పిన వెంటనే నిముషంలో పార్శిల్ చేసి ఇస్తారు. లేటవదు. అదీ ఫాస్ట్ ఫుడ్స్ అంటే'' అంటూ వాడి జ్ఞానం అంతా వెళ్ళబోశాడు.

ఆలూపాలక్ కూరట, పన్నీర్ మసాలా ఇవన్నీ వాడు తెచ్చాడు. ఏదో భోజనం అయిందనిపించానుగానీ అంతా యాంత్రికత. రాత్రి ఆ కబుర్లూ ఈ కబుర్లూ చెప్పుకుంటూ టీవీ చూస్తూ గడిపాము.

టీవీ చూస్తున్నంతసేపు వెధవది ఈ ఏడేళ్ల రవి చేతిలో రిమోట్ కంట్రోల్ పట్టుకుని అది కాదు ఇది ఇది కాదు అదనీ, ఏమ్‌టీవీట, జీటీవీ అని, ఈ టీవీ అంటూ అన్నీ టప టపమని మారుస్తూ ఏ ఛానల్‌లో ఎన్ని గంటలకి ఏం వస్తుందో గడగడమని వాడు చెబుతుంటే నేను మాత్రం ముక్కున వేసుకోవాల్సి వచ్చింది.

★★★

ప్రొద్దునే లేచి నా పుత్ర రత్నానికి చెప్పాను సాయంత్రం బస్సులో బయలుదేరుతానని.

''అదేంటి నాన్నా! అస్సలు వున్నట్లేలేదు. రెండురోజులు వుండి వెళ్లరుగాని'' అన్నాడు.

''నా కోసం వుండండి మామయ్యా. పోనీ ఈ ఒక్కరోజు వుండండి. రేపు వెళ్లరుగాని'' అంటూ నా కోడలు చెప్పడంతో అలాగే అన్నాను.

మర్నాడు ప్రొద్దునే బయలుదేరడానికి సిద్ధపడ్డాను.

''నాన్నా! మీరు కూడా ఇక్కడికే వచ్చేయకూడదు. ఎందుకక్కడ మీరు వంటరిగా. మీరు ఎలా వున్నారో అని మేము అనుకోవడం. వున్నంతలోనే అందరం సరదాగా ఇక్కడే వుండొచ్చుకదా'' అన్నాడు మావాడు.

''అవును మామయ్యా! ఆయనన్న విధంగానే చేస్తే బాగుంటుందేమో'' అంటూ జత కలిపింది నా కోడలు.

''వద్దమ్మా! అయినా మిమ్మల్ని చూడాలనిపించినప్పుడు వస్తూనే వుంటాగా'' అన్నాను నేను.

''ఆలోచించండి నాన్నా. ఈ వయసులో మీరు వండుకు తినడం, ఏం అవస్థ పడుతున్నారో అని మేము అనుకోవడం, ఆ పాడుబడిన కొంపలో ఎందుకొచ్చిన అవస్థలు. అది అమ్మిపారేసి ఇక్కడికి వచ్చేయండి. కాలంతోపాటు మనమూ మారాలి నాన్నా. కాస్త పాత చింతకాయ పద్ధతులు మానండి'' అంటూ హితబోధ చేశాడు.

''మరి వస్తాను నేను'' అంటూ సూట్‌కేసు పట్టుకులేచాను. ఆ ప్రస్తావన కొనసాగించడం ఇష్టంలేక.

వాడుకూడా మౌనంగా వచ్చి ట్రైన్ ఎక్కించాడు.

వాడిమీద నాకు కోపంలేదు. నామీద కూడా వాడికి అంతే. వున్నది అంతా కేవలం అభిప్రాయాలలో తేడా. మారిపోయే కాలంతోపాటు మనమూ మారాలన్నది వాడి వాదన.

కాలం మారలేదు. ఆ కాలానికి అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ ఇరవై నాలుగు గంటలే. సమానమైన పగలు, రాత్రివేళలు. మారినదల్లా మన జీవన విధానం. మనలో మనమే సృష్టించుకున్న బ్రతుకువేగం. సుఖవంతమైన జీవితాల్లో యాంత్రికతలు, నిర్లిప్తతలు అంతే.

ట్రైను స్పీడుతోపాటు నా ఆలోచనలు ఊపందుకున్నాయి.

ఎవడి బాధలు వాళ్లవి. ఎవరి జీవన సరళి వారిది.

ఇంతకీ మీరెటువైపు? మీ ఓటు నాకా? నా పుత్రరత్నానికా? ఏది ఏమైనా పిండారబోసినట్లు వెన్నెల మా డాబామీద పరుచుకున్నప్పుడు రాత్రి ఇంగ్లీషు న్యూస్ విని హాయిగా పక్కలేసుకుని ఆ డాబాని అనుకుని వున్న మా ఇంట్లో రావిచెట్టు చల్లని గాలిని పంచి పెడుతున్నప్పుడు నాతో ఎన్నో వసంతాలు జీవితం పంచుకుని నన్నొదిలి సుదూర తీరాలకు వెళ్లిపోయిన నా భార్య స్మృతులు నెమరు వేసుకుంటూ హాయిగా పడుకోవడంలో వున్న తృప్తి...

క్షణానికో ఛానల్ మార్చి చూడగలిగే టీవీల్లోనూ, చిటికవేసిన వెంటనే భోజనం సమకూర్చే ఆ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనూ, నిముషంలో ఎక్కడికయినా చేర్చే రణగొణ ధ్వనుల సిటీబస్సుల ప్రహసనంలోనూ నాకు దేనిలోనూ కలగదేంటో...

★